నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

1

ఆదివారం | 17 డిసెంబర్ 2023 | www.navatelangana.com

కేటీఆర్ మాటలను తప్పుబట్టిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ జోగిపేట

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో శనివారం కాంగ్రెస్ పార్టీలోని దామోదర రాజనర్సింహతో పాటు మరికొంతమంది సీనియర్ నాయకుల పేర్లు ప్రస్తావిస్తూ వారు పెట్టిన పార్టీలో తెలంగాణ ప్రజలు ఎన్నుకున్న సీఎం కాకుండా ఢిల్లీలో నామినేటెడ్ అయి సీఎంగా రేవంత్ రెడ్డి వచ్చి దూరారని ప్రస్తావించిన మాటలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీకి ఒక చరిత్ర ఉందని, ప్రభుత్వం, పార్టీలో మెజారిటీ ఎప్పుడు ఉన్న తాము హై కమాండ్ క అప్పజెప్తామని, హై కమాండ్ నిర్ణయానికి మేము శిరసావహిస్తామని, వాటిని పాటిస్తామని ఆయన సూటిగా సమాధానం ఇచ్చారు.

కేంద్ర పథకాలు అర్హులకు అందించాలి

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ గుప్తా



నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

కేంద్ర పథకాలు అర్హులకు అందించాలని కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ గుప్తా అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించడం, పథకాలు అర్హులకు అందేలా తెలియజేయడానికి రూపొందించిన కార్యక్రమమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అని తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సిద్దిపేట జిల్లాలో చేపట్టనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో కేంద్ర టెక్స్టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సమీక్షించారు. అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును అభినందించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, ఎల్డీఎం సత్యజిత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నో భరోసా
రైతు బందే





- ఎకరాలకు రూ.5 వేలే జమ
- విధి విధానాలేవి?
- కౌలు రైతులు, భూమిలేని కూలీల గుర్తింపులో ఆలస్యం
- పట్టాదారు, కౌలుదారులో ఎవరికిస్తారో తెల్వదు
- ఎన్నికల హామీ మేరకు రూ.7,500 ఇవ్వాలనే డిమాండ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గత ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు పథకం స్థానంలో రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు బంధు కింద ఎకరాలకు రూ.5 వేలు మాత్రమే పెట్టుబడి సాయం కింద ఇచ్చారు. గత ప్రభుత్వం ఇచ్చిన సాయాన్ని పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏటా ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం కింద రైతులతో పాటు కౌలు దారులకూ ఇస్తామని చెప్పారు. వీరితో పాటు భూమిలేని వ్యవసాయ కూలీలకు కూడా ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం ఇస్తామన్నారు. దీంతో రైతులు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపి ఓట్లేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా అమలు చేస్తారని రైతులు ఆశించారు. డిసెంబర్ 9 నుంచి ఆరు గ్యారంటీలన్నీ అమలు చేస్తే అందులో రైతు భరోసా కూడా ఉంటుందనుకున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన వెనువెంటనే మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల వైద్యం అందించే పథకాల్ని ప్రారంభించారు. రైతులు కూడా రైతు భరోసా గురించి ఆశగా ఎదురు చూస్తున్నందున ఎన్నికల్లో చెప్పిన భరోసా కాకుండా గత ప్రభుత్వం అమలు చేసిన మాదిరే రైతు బంధు కింద ఇచ్చిన సాయాన్నే ప్రస్తుతం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రైతు బంధు మాదిరే పెట్టుబడి సాయం

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిన రైతు భరోసా కాకుండా రైతు బంధునే అమలు చేస్తున్నారు. కొత్త పథకం అమలు కోసం విధి విధానాలు రూపొందించేందుకు సమయం పడుతున్నందున పాత పద్ధతిలోనే రైతులకు పెట్టుబడి సాయం అందించాలని వ్యవసాయ శాఖకు ఆదేశాలందాయి. దీంతో ప్రస్తుత సీజన్‌కు గాను ఎకరాకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తున్నారు. తొలుత ఎకరా భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. విడతల వారిగా రైతులకు డబ్బులు జయచేయనున్నారు. గత ప్రభుత్వంలో రైతు బంధు కింద సంగారెడ్డి జిల్లాలో 339289 మంది, మెదక్ జిల్లాలో 274815 మంది, సిద్దిపేట జిల్లాలో 404438 మంది రైతులు కలిపి మూడు జిల్లాల్లో 1018542 మంది రైతు బంధు లబ్ధిదారులున్నారు. వీరందరికీ రైతు బంధు ఇస్తారా ఇవ్వరా అనేది స్పష్టతలేదు. ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ ఎకరా లోపు భూమి ఉన్న రైతులకు డబ్బులు జమ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎకరాలోపు భూమి ఉన్న 35383 మంది రైతులకు రూ.9.41 కోట్ల డబ్బుల్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లాలో 40150 మందికి 11.12 కోట్లు, మెదక్ జిల్లాలో 18 వేల మంది రైతులకు రూ.7 కోట్ల వరకు వేసినట్లు చెబుతున్నారు. ఎకరాలకు రూ.5 వేల చొప్పున పట్టాదారుకు ఎంత భూమి ఉంటే ఆ లెక్కన డబ్బులు పడతాయని అధికారులు చెబుతున్నారు. ఎన్ని ఎకరాల వరకు పెట్టుబడి సాయం ఇస్తారనేది కూడా స్పష్టత ఇవ్వట్లేదు.

విధి విధానాలొచ్చాకే రైతు భరోసా

కాంగ్రెస్ ప్రకటించిన రైతు భరోసా పథకానికి సంబంధించి విధి విధానాలు ఖరారు చేయడానికి సమయం పడుతుందంటున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు ఎలా ఉంటాయనేది తేలాల్సి ఉంది. రైతు భరోసా పథకం ద్వారా రైతుల్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా కౌలు దారులు, భూమిలేని వ్యవసాయ కూలీలకు కూడా ఆర్థిక సహాయం అందించాల్సి ఉంది. రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12 వేల సాయం ఇవ్వడానికి విధి విధానాలేమిటీ అనేది ప్రభుత్వం ప్రకటించాకనే తెలుస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.15 వేలు ఇవ్వడం పెద్ద కష్టమేమీ కాదంటున్నారు. గతంలో రైతు బంధు ఇవ్వడానికి పట్టాదారులందర్నీ రైతులుగా గుర్తించి ఇచ్చారు. పరిమితి లేకుండా రైతులందరికీ పెట్టుబడి సాయం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలనే విషయంలో నిపుణుల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఐదు ఎకరాలకు లిమిట్ పెట్టాలనే అభిప్రాయం ఉన్నప్పటికీ పది ఎకరాల వరకు కూడా ఇస్తే తప్పేమిలేదనే చర్చ కూడా ఉన్నది. సాగు భూములన్నిటికీ ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉంది. ప్రభుత్వం ఆలోచన బట్టి లిమిట్ పెట్టే అవకాశముంది. ఇక కౌలు రైతుల గుర్తింపు కోసం కూడా మార్గదర్శకాలు రావాలి. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో కౌలు రైతుల్ని గుర్తించి గుర్తింపు కార్డులిచ్చారు.

పంట రుణాలు, పంట నష్టపరిహారం అందించారు. అందు కోసం భూ యజమాని నుంచి కౌలు పత్రం పొంది ఉన్న వాళ్లను మాత్రమే కౌలు రైతులుగా గుర్తించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా కాంగ్రెస్‌దే అయినందున అదే పద్ధతి అనుసరిస్తారా..? లేక మరేదైన మార్గం చూస్తారా అనేది చూడాలి. రైతుకు, కౌలుదారుకూ పెట్టుసాయం ఇస్తామని చెప్పినందున భూమి ఒకటే కానీ..! పెట్టుబడి సాయం మాత్రం రెండు సార్లు ఇవ్వాల్సి వస్తుందనే చర్చ కూడా ఉంది. రైతుకు పెట్టుబడి సాయం ఇచ్చాక అదే భూమిని కౌలుకు సాగుచేసే కౌలుదారుకు కూడా సాయం ఎలా ఇవ్వాలనేది తేలాలి. కౌలుదారుకు అంగీకార పత్రం రాసి ఇవ్వడానికి పట్టాదారులు ఇష్టపడతారాలేదా అనేది కూడా ఇబ్బందికరమైన విషయమనే చెప్పాలి. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో 65 వేల మంది, సిద్దిపేట జిల్లాలో 40 వేల మంది, మెదక్ జిల్లాలో 24650 మంది కౌలు రైతులున్నట్లు ప్రాథమికంగా ఒక అంచనా వేశారు. విధి విధానాలు ప్రకటించాక వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా భూమిలేని వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం రూ.12 వేలు ఇవ్వడానికి ఉపాధి జాబ్‌కార్డులున్న వాళ్లకే ఇస్తారా...లేక తెల్ల రేషన్‌కార్డు ఉన్న పేదల్ని గుర్తిస్తారా..? అనే చర్చ నడుస్తుంది.

రూ.7500 ఇవ్వాలని రైతుల అభిప్రాయం

కాంగ్రెస్ ప్రకటించిన మాదిరి ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. యాసంగీ సీజీన్ డబ్బులు రూ.7500 చొప్పున జమ చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే యాసంగీ సీజన్ పంటల సాగు పనులు జరుగుతున్నాయి. పత్తి, ధాన్యం అమ్మకాలు జరుగుతున్నా డబ్బులు చేతికొచ్చేందుకు సమయం పట్టనుంది. వరినార్లు పోశారు. నాట్లు వేసే సయం వస్తుంది. ఎరువులు, విత్తనాలు, దున్నకం కోసం పెట్టుబడి కావాల్సి ఉన్నందున రైతులు ప్రభుత్వం ఇచ్చే డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం పాత పద్ధతిలో రూ.5 వేలు ఇస్తే పెంచిన డబ్బులు వచ్చే ఖరీఫ్ సీజన్‌లోనే రైతులకు అందే అవకాశముంది.

> ప్రభుత్వం మారినా పథకం మారలే అన్నట్లుంది రైతు బంధు పథకం పరిస్థితి. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9 నుంచి కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలన్నీ అమలవుతాయని ప్రకటించినప్పటికీ ప్రస్తుతం పాత విధానం ప్రకారమే రైతులకు పెట్టుబడి సాయం ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రకటించిన రైతు భరోసా పథకం అమలు కోసం విధి విధానాలు ఖరారు కాకపోవడంతో పాత పద్ధతిలోనే సాయమివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. రైతు భరోసా కింద రైతులకు, కౌలుదారులకు, భూమిలేని వ్యవసాయ కూలీలకూ సాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో రైతులెవరనే వివరాలున్నాయి. కౌలు రైతుల వివరాల్లేవు. భూమిలేని వ్యవసాయ కూలీల గుర్తింపు కోసం కూడా ఏ ప్రతిపాదికన చేస్తారనేది చూడాలి. రైతులు మాత్రం పథకం పేరేదైనా సాయం రూ.7500 ఇవ్వాలని కోరుతున్నారు.

రైతులను ఇబ్బందులు పెట్టకుండా
పత్తి కొనుగోలు చేయాలి

- ప్రైవేట్ వ్యాపారస్తుల కొమ్ము కాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి
- పత్తికి మద్దతు ధర ఇప్పించాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతులను ఇబ్బందులు పెట్టకుండా సీసీఐ పత్తి కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రైతు సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం నాయకులు జయరాజు మాట్లాడుతూ పత్తి రైతులకు అన్యాయం చేస్తూ ప్రైవేట్ వ్యాపారస్తుల కొమ్ము కాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐ, పత్తి మిల్లుల యాజమాన్యాలు, బయట ప్రైవేటు వ్యాపారస్తులు కలిసి రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ప్రైవేటు కొనుగోలుదారులు, బయట ప్రైవేట్ వ్యాపారస్తులు రూ.6,300లకు గ్రామాల్లో రైతుల వద్ద పత్తి కొని లారీల్లో నింపి నేరుగా ప్రైవేటు వ్యాపారస్తులు సీసీఐకి అమ్ముకుంటున్నా పట్టించుకునే వారే లేరని వాపోయారు. సీసీఐకి మద్దతు ధర రూ.7,020 చొప్పున ప్రైవేట్ వ్యాపారస్తులు అమ్ముకుంటున్నారని తెలిపారు. రైతులు క్వింటాల్ పత్తికి రూ.500 నుంచి రూ.700 వరకు నష్టపోతున్నారని తెలిపారు. ప్రైవేటు వ్యాపారస్తులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నేరుగా రైతుల నుంచి సీసీఐ కొనే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల పేర్లు ఆన్లైన్లో లేకపోవడంతో జిన్నింగ్‌మిల్ యజమానులు, సీసీఐ సిబ్బంది, ప్రైవేట్ వ్యాపారస్తులు కలిసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని తెలిపారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కే. రాజయ్య , జిల్లా నాయకులు మాణిక్ రెడ్డి, నాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

పంతులుతండాకు బస్సు సౌకర్యం

మాట నిలబెట్టుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-అక్కన్నపేట

ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న పొన్నం ప్రభాకర్‌కు గిరిజనవాసులు తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెంటనే స్పందించి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నుంచి గెలవగానే పంతులు తండాకు బస్సు సౌకర్యం కల్పిస్తానని తండావాసులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా చోటు దక్కించుకున్న పొన్నం ప్రభాకర్ వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించినట్లు అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి తెలిపారు. శనివారం హుస్నాబాద్ బస్ స్టేషన్ నుండి పంతులు తండాకు సర్వీస్ ను ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. గిరిజనులకు బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకరు కు కృతజ్ఞతలు తెలిపారు. పంతులు తండా సర్పంచ్ అశ్విని హేమ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కరంతోత్ రవి నాయక్, రాజేందర్ నాయక్, లకు పతి నాయక్, పీరమ్మ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం సోమజీతండాకు చెందిన భూక్యలక్ష్మి ఇటీవల బస్సు ప్రమాదంలో మరణించింది. విషయం తెలుసుకున్న బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం భూక్య లక్ష్మి కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిరాణా సామగ్రి అందించారు. ఇటీవల ఇప్పలపల్లి గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు పెండ్యాల సారయ్య కుటుంబానికి కూడా 50 కిలోల బియ్యం కిరాణా సామాన్ అందజేశారు. కార్యక్రమంలో అక్కన్నపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, గుడాటిపల్లి సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, గోవర్ధనగిరి ఎంపీటీసీ గొర్ల స్వప్న శ్రీను, సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్, సారయ్య, కంది తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, భూక్యరాజు, లక్ష్మణ్, కిషన్, గంగ్య నాయక్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దండు శంకర్



నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో జరిగింది. ఆ గ్రామానికి చెందిన దేశెట్టి శాంసన్(70) పుట్టుకతోనే దివ్యాంగులు. ఇటీవల ఆరోగ్యం బాగాలేక ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లారు. శరీరంలోని అవయవాలు పనిచేయకపోవడంతో శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దండు శంకర్ దేశెట్టి శాంసన్ మృతిదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి సంఘం తరపున రూ.16 వేల ఆర్థిక సాయం చేశారు. కట్కూరి యాదగిరి, వందుల బాలమణి, దోరం భూపతి రెడ్డి, పిడిశెట్టి నారాయణ, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రమేష్, సురేష్, జగన్, నర్సింహులు, అశోక్, రాజు, రాణి, సువర్ణ, కనకవ్వ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహేంద్ర అండ్ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో
సీఐటీయూ ఘన విజయం











జహీరాబాద్‌లో భారీ ర్యాలీ

నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర అండ్ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో శనివారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో యూనియన్ అధ్యక్షులుగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఘన విజయం సాధించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు 76 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికైన చుక్క రాములుకు కార్మికులు మిఠాయి తినిపించారు. చుక్క రాములను కార్మికులు తమ భుజస్కంధాలపై ఎత్తుకొని పరిశ్రమ గేటు వద్ద సంబరాలు చేసుకున్నారు. గతంలో ఉన్న యూనియన్లు కార్మికులకు ఇచ్చిన షోకాజు నోటీసులను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం కార్మికులు బాణాసంచా కాల్చుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ జిల్లాలోనే మెరుగైన వేతన ఒప్పందం చేసిన ఘనత సీఐటీయూకే దక్కుతుందన్నారు. మహేంద్ర అండ్ మహేంద్ర ప్రధాన ప్లాంట్లో కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు ట్రాక్టర్ ప్లాంట్‌లోని కార్మికులకు కూడా కల్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమాలు చేసి హక్కులను సాధించుకోవాలన్నారు. యూనియన్ గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి మల్లేశం జీ సాయిలు మాట్లాడుతూ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ పరిశ్రమల్లో కార్మికుల హక్కులను సాధించిన ఘనత సీఐటీయూకే దక్కుతుందన్నారు. ట్రాక్టర్ ప్లాంట్ కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి రామచందదర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్, మహేంద్ర అండ్ మహేంద్ర ఆటోమోటివ్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి పి రాజిరెడ్డి, నాయకులు కనకా రెడ్డి, వీరయ్య గౌడ్, బీ పి సి శేఖర్, అంజయ్య, బాబు, వంశీ, రాజు, రాములు, చంద్రశేఖర్, నారాయణ, నాజీమ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

మహేంద్ర అండ్ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్లో శనివారం జరిగిన గుర్తింపు ఎన్నికల్లో యూనియన్ అధ్యక్షులుగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఎన్నికైన సందర్భంగా కార్మికులు, కార్మిక సంఘం నాయకులు ఆయనను అభినందించారు. పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ యజమాన్యంతో పాటు కార్మికులు కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ విజయంపై హర్షం

నవతెలంగాణ- సదాశివపేట

జహీరాబాద్‌లోని మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో శనివారం యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ఘన విజయం సాధించడంపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కేవీ చేసిన మోసాలు, గత అగ్రిమెంట్ విషయంలో జరిగిన అన్యాయాలను కార్మికులు పసిగట్టి బీఆర్ఎస్‌కేవీను కార్మికులు గట్టిగా దెబ్బ కొట్టారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నీలం మల్లేశం, శ్రీనివాస్, రమేష్‌గౌడ్, ఎండీ ఖయ్యూం, మహేందర్‌రెడ్డి, మోహన్‌చారి, అంజయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ జోగిపేట

జహీరాబాద్‌లోని మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు విజయం సాధించడం హర్షణీయమని సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ పేర్కొన్నారు. కార్మికులకు అండగా సీఐటీయూ ఉంటుందన్నారు. సీఐటీయూ కార్మిక సంఘంతోనే తాము ఉంటామని ఆదరించిన మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులకు సీఐటీయూతోనే న్యాయం కలుగుతుందన్నారు.

ప్రజలను భాగ్యస్వామ్యం చేసేందుకే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర





- వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను ప్రారంభించిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్
- వర్చువల్ గా ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రజలను భాగ్యస్వామ్యం చేసేందుకే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర అని రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్ గడ్డ దేవాలయం దగ్గర శనివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ప్రారంభించారు. వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసేలా గ్రామాల్లో ప్రత్యేక ప్రచార రథాలు తిరిగనున్నాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పేదరికం తెలిసిన వ్యక్తి అని, మహిళల ఆత్మ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలకు 10 కోట్ల మందికి మరుగుదొడ్లు మంజూరు చేసి అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. యూపీలో ఆరేళ్లలో 50 లక్షల మందికి ఇండ్లు నిర్మించామన్నారు. తెలంగాణలో 2 లక్షల ఇండ్లు కూడా కట్టలేదని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద 35 లక్షల మందికి ఎకరానికి రూ.6 వేలు ఇస్తున్నామని తెలిపారు. ఎరువుల సబ్సిడీ కూడా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇస్తుందని గుర్తు చేశారు. ఉజ్వల గ్యాస్ పథకం ద్వారా 10 కోట్ల మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్ ఇచ్చామన్నారు. ప్రతి పల్లెలకు ప్రధాని నరేంద్ర మోడీ గ్యారెంటీ పేరు మీద ప్రచార రథాలు వస్తున్నాయన్నారు. దేశంలోని 81 కోట్ల పేద ప్రజలకు గత రెండు సంవత్సరాలుగా ఒకరికి చొప్పున 5 కిలోల బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పేదలకు ఏదైనా జబ్బు చేస్తే ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా వర్తిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, డిఎల్పిఓ సతీష్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, రుద్రారం గ్రామ సర్పంచ్ సుదీర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

ఎమ్మెల్యే కవ్వంపల్లికి విజ్ఞప్తి చేసిన రాసూరి మల్లికార్జున్



నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు విజ్ఞప్తి చేసినట్టు మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ తెలిపారు. హైదరాబాదులోని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను అయన నివాసంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అక్కరవేణీ పోచయ్య రాసూరి మల్లికార్జున్, గాదం స్వామి, మిట్టపల్లి చెన్నారెడ్డి, పులి రమేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మానకొండూరు నియోజకవర్గంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు వారి అనుచరులకు ధరణి పోర్టల్ సహాయంతో ప్రభుత్వ భూములను అక్రమ పట్టా మార్పిడి చేయించారని, గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో, నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. వెంటనే ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమదారులను రికార్డుల నుంచి తొలగించి నిజమైన లబ్ధిదారుల పేర్లు యథావిధిగా నమోదు చేసి న్యాయం చేయాలని కోరినట్టు మల్లికార్జున్ తెలిపారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

జోగిపేట 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు



నవతెలంగాణ జోగిపేట

జనవరి 1, 2024 సంవత్సరం నాటికి 18 సంవత్సరాల నిండిన యువతి యువకులు ఓటరు జాబితాలో తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అందోల్ జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు తెలిపారు. శనివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాన్ని అర్హులు సద్వినిగం చేసుకోవాలన్నారు. త్వరలో జరగనున్న లోక్ సభ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ అవకాశాన్ని కల్పిస్తుంది అన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. శని, ఆదివారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు అన్నారు. యువతి యువకులు కచ్చితంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు కావాలన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం



యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీకి చెందిన యువకులకు వి.వి.ఆర్ ఫౌండేషన్ తరపున వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల మక్కువ పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించి ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. క్రీడా పరికరాలు అందజేసిన నాయకులకు కాలనీ యువకులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జె.జె సింగ్, సతీష్, సురేష్, సంతోష్, జీవరత్నం, నవీన్, వినోద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పట్లోళ్ల కుటుంబం ఐదుసార్లు విజయం

- నాలుగుసార్లు తండ్రి, ఒకసారి తనయుడు
- ప్రజల మన్ననలు పొందిన పట్లోళ్ల కుటుంబం

పేరు: డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి
జననం: 14-05-1963
తల్లిదండ్రులు : మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి, గాలెమ్మ
భార్య: అనుపమ సంజీవ రెడ్డి
చదువు: ఎంబీబీఎస్
వృత్తి: డాక్టరు
రాజకీయ ప్రస్థానం: 2006 కాంగ్రెస్ జెడ్పీటీసీగా ఎన్నికై 2014 వరకు సేవలందించారు. 2014 నుండి 2018 వరకు ఎంపీపీగా పని చేశారు. 2016లో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2018 సాధారణ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో 5,766 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గంలో 16సార్లు ఎన్నికలు జరిగితే ఐదుసార్లు పట్లోళ్ల కుటుంబం విజయం సాధించింది. నియోజకవర్గం ప్రజలు నాలుగుసార్లు పట్లోళ్ల కిష్టారెడ్డిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. 2023 ఎన్నికల్లో పట్లోళ్ల సంజీవరెడ్డి సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మహారెడ్డి భూపాల్‌రెడ్డిపై 5766 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. 10 సంవత్సరాలుగా పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గంలో ప్రతిపక్ష నేతగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. పట్లోళ్ల కిష్టారెడ్డి తనయుడిగా నారాయణఖేడ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించారు సంజీవరెడ్డి. పట్లోళ్ల కిష్టారెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పని చేసి సామాన్యులు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సేవలందించారు. 2015లో కిష్టారెడ్డి గుండెపోటుతో మరణించారు. 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి పట్లోళ్ల సంజీవరెడ్డి ఓడిపోయారు. బీఆర్ఎస్ అభ్యర్థి మహారెడ్డి భూపాల్‌రెడ్డి 50 వేల మెజారిటీతో గెలుపొందారు. నియోజకవర్గంలో ప్రతిపక్ష నేతగా పట్లోళ్ల సంజీవరెడ్డి ఏడు సంవత్సరాలు ప్రజల పక్షాన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేశారు.

నిరాహార దీక్ష

సింగూర్ జలాలను శ్రీరామ్ ప్రాజెక్టుకు తరలించడంతో సింగూర్ జలాలను జిల్లాకు కేటాయించాలని కోరుతూ పట్లోళ్ల సంజీవరెడ్డి నిరాహార దీక్ష చేపట్టారు. చాప్టకె, నిజాంపేట్, రామోజీపల్లి, సిర్గాపూర్ గ్రామాలలో పేదల ఇండ్ల





కూల్చివేతపై సంజీవరెడ్డి ప్రజలకు అండగా నిలిచారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలను చైతన్యం చేశారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా నిలబడ్డారు.

సేవా కార్యక్రమాలు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం పట్లోళ్ల సంజీవరెడ్డి జాబ్ మేళా ద్వారా 1500 మందికి ఉద్యోగాలు ఇప్పించారు. ఉచిత వైద్య శిబిరాలు



నిర్వహించారు. పీకేఆర్ ట్రస్ట్ ద్వారా బ్లడ్ క్యాంపులు నిర్వహించారు.

కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు

గ్రూపు రాజకీయాల వల్ల నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు గెలిచే అవకాశాలను చేజార్చుకుంది. 2016లో పట్లోళ్ల కిష్టారెడ్డి తనయుడు సంజీవరెడ్డి; సురేష్‌షెట్కార్‌ల మధ్య గ్రూపు రాజకీయాలు జోరుగా సాగాయి. రాజకీయ తగాదాలతో ఇద్దరూ విడిపోవడంతో రెండు పర్యాలు కాంగ్రెస్ విజయం సాధించలేకపోయింది. 2023లో కార్యకర్తల అభిప్రాయంతో ఇద్దరూ కలవడంతో ఈ ఎన్నికల్లో అఖండ విజయం సాధించారు.

ప్రజా సేవకే జీవితం అంకితం

భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ప్రజా సేవకే తన జీవితం అంకితమన్నారు. యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరుగ్యారెంటీలను అందిరికీ అమలు చేస్తామన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తామన్నారు.



రేపు మండల సర్వసభ సమావేశం

నవతెలంగాణ-జోగిపేట

ఈనెల 18న మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు అందోల్ ఎంపీడీవో సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ జోగు బాలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించబడుతుందన్నారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా నారీకేల అయ్యప్ప స్వామి మహా పడిపూజ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని సట్టి హనుమాన్ దేవాలయంలో పరమేశ్వర్ గౌడ్ గురు స్వామి నారీకేల 18వ మహా పడిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన అరుణ్ గురుస్వామి కనకమలచే శబరిమలైలో జరిగే విధంగా తంత్ర విధానంలో అయ్యప్ప స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జంగిరెడ్డి ప్రజల బృందం పాడిన పాటలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. పరమేశ్వర్‌గౌడ్ గురుస్వామిని సంగారెడ్డి, సదాశివపేట, పటాన్ చెరు గురు స్వాములు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ సుజాత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పడి వెలిగించి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు

నేడు అంత్యక్రియలు

నవతెలంగాణ జహీరాబాద్



జహరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీపాటిల్ సోదరులు విఠల్‌రావు పాటిల్ బస్వంత్‌రావు పాటిల్ శనివారం సాయంత్రం మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియలు ఆదివారం ఉదయం 10 గంటలకు జుక్కల్ నియోజకవర్గంలోని వారి స్వగ్రామం సిర్పూర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం

నవతెలంగాణ-జహీరాబాద్

ఈ నెల 17న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు గడ్డం జనార్ధన్ తలిపారు. ఉదయం 11.30 గంటలకు మండల అధ్యక్షులు గడ్డం జనార్ధన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మండల కార్య వర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు కార్యక్రమానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కంగ్టి గ్రామపంచాయతీకి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలి

నవతెలంగాణ-కంగ్టి



రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండల కేంద్రమైన కంగ్టికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని కేవీపీయస్ మండల ప్రధాన కార్యదర్శి దాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత యాభై సంవత్సరాల నుంచి కంగ్టికి సర్పంచ్ సీటు ఎస్సీకి కేటాయించలేదన్నారు. మెజార్టీ జనాభా ఉన్నప్పటికీ కొంత మంది స్వార్థ రాజకీయం వల్ల రావట్లేదన్నారు. గ్రామంలో 9,996 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో మెజారిటీ జనాభా ఎస్సీలదే ఉన్నప్పటికీ ప్రభుత్వం రిజర్వేషన్ కేటాయించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు చొరవ తీసుకుని రిజర్వేషన్ కేటాయించాలని కోరారు.

నేటి నుంచి ముస్లాపూర్ రామాలయంలో పూజలు

నవతెలంగాణ జోగిపేట

ఈ నెల 17వ తేదీ నుంచి ధనుర్మాసం ఆరంభం అవుతున్న సందర్భంగా నియోజకవర్గంలోని అల్లాదుర్గం మండలం మూస్లాపూర్ గ్రామంలోని రామాలయంలో తిరుప్పావై విశేష పాశురములతో అర్చన, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇప్ప కృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ఉదయం 5 గంటల నుండి 7గంటల వరకు దర్శించుకోవచ్చు అని భక్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

పేద విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో యూనిమనీ ఫైనాన్స్ కార్యాలయాన్ని సంస్థ సీఈవో కృష్ణనన్ శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు మంచి సేవలు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో అందిస్తున్నామని అన్నారు. గోల్డ్ లోన్స్, ఫారన్ కరెన్సీ ఎక్స్ఛేంజ్ , టూర్ లకు సంబంధించిన సేవలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ జెడ్ హెచ్ శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ రీజియన్ మేనేజర్ రాజు, సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



నవతెలంగాణ-మిరుదొడ్డి

మిరుదొడ్డి మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన బుడగ జంగం పర్వతం నర్సింలు(42) వావిలకుంటలో మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య మల్లవ్వ, ముగ్గురు పిల్లలు శ్వేత, అరవింద్, శ్రీను ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిరుదొడ్డి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సిబ్బంది కోసం ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఎస్పీ చెన్నూరి రూపేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నీటిని సద్వినియోగం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 18 నుంచి రూ.5 చెల్లించి వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సౌకర్యం పట్టణ ప్రజలకు కూడా అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సిబ్బంది కోసం పోలీసు బార్బర్ షాప్‌ను ప్రారంభించారు. రానున్న రోజుల్లో సూపర్ మార్కెట్‌ను తలపించేలా పోలీసు క్యాంటీన్(కామధేనువు)ను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డా.పి.అశోక్, జనార్ధన్ ఎ.ఆర్.డిఎస్పీ, ఆర్.ఐ.లు రాజశేఖర్ రెడ్డి, రామరావ్, హన్మి రెడ్డి, శివలింగం ఇన్స్పెక్టర్, మహేష్ గౌడ్, విజయ్ కృష్ణ ఇన్స్పెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి కల్పించాలని ఆటో డ్రైవర్ల నిరసన

నవతెలంగాణ-గుమ్మడిదల



కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం నిర్ణయం తీసుకోవడంతో ఆటో డ్రైవర్ల కుటుంబ పరిస్థితులు అధ్వానంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని కోరుతూ శనివారం గుమ్మడిదల మండలంలోని కానుకుంట ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పట్ల తీసుకున్న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ నిర్ణయంతో ఆటో డ్రైవర్ల కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆటోల ఫైనాన్స్ కూడా చెల్లించలేని పరిస్థితులకు దిగజారిపోయామని వాపోయారు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల కుటుంబాలను బాగు చేయడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యం

- క్లూస్ టీంతో పోలీసుల విచారణ

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం మంగంపేట శివారులో గుర్తు తెలియని కాలిన మహిళా మృతదేహం శనివారం లభించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సంఘటనా స్థలాన్ని పటాన్చెరువు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణు కుమార్, ఎస్సై విజయ రావు పోలీసు బృందంతో కలిసి పరిశీలించారు. పోలీసుల కథనం ప్రకారం... మంగంపేట శివారులోని బొమ్మనకుంట ప్రాంతంలో గుర్తుతెలియని 25 సంవత్సరాలు వయసు గల మహిళా మృతదేహం పడిఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహిళా మృతదేహం పూర్తిగా కాలిన గాయాలతో ఉంది. గుర్తు తెలియనివారు పెట్రోల్, డీజిల్ పోసి హత్య చేసినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. మహిళ మృతదేహం చెవి కమ్మలు, కాలిమట్టెలు ఉన్నాయని చెప్పారు. క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించిందన్నారు. మృతదేహానికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియలేదన్నారు. ఎవరైనా గుర్తుపట్టినచో ఎస్సై విజయరావ్ సెల్ 8712656750, సిఐ వేణు కుమార్ సెల్ 8712656730లకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

నవతెలంగాణ-కంది

టీఎస్‌యూటీఎఫ్ కంది మండలం మహాసభ శనివారం సాయంత్రం కంది ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేస్తామని, పెండింగ్లో ఉన్న మూడు డీఏలను ఇస్తామని, పీఆర్సీ ఆరు నెలల్లో అమలు చేస్తామని శనివారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, వెంటనే ఆ దిశగా అమలు చేయాలని కోరారు. కంది మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యం.జగన్మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.సింహాచలం, ఉపాధ్యక్షులుగా సంగయ్య, జోత్స్నారెడ్డి, కోశాధికారిగా మేరీ హెలెన్, కార్యదర్శులుగా రాములు, సంజీవులు, సరళ విఠల్, జైబున్నీసా ఎన్నికయ్యారు. ఎన్నికైన మండల అధ్యక్ష కార్యదర్శులు జగన్మోహన్, సింహాచలం మాట్లాడుతూ తమను ఎన్నుకున్నందుకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని





పోరాటం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చందర్ రాథోడ్, జిల్లా కార్యదర్శి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలం మహదేవ్‌పల్లి గ్రామానికి చెందిన గుండువారి నారాయణగుప్త శనివారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంభ్యులు వెంకటేశం గుప్త, నర్సింలు గుప్తలను పరామర్శించారు. ఆయన వెంట మండల జడ్పీటీసీ నర్సింహా రెడ్డి,మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాంసింగ్,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దీలిప్,మాజీ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారాయణ రావు, గ్రామ సర్పంచ్ తనయులు నాగదారు పోచయ్య, గ్రామ పార్టీ నాయకులు



సుధాకర్,విఠల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
ఆదివారం | 17 డిసెంబరు 2023 | www.navatelangana.com

రాష్ట్ర స్థాయి క్రీడాకారిణికి డీఈవో అభినందనలు



నవతెలంగాణ- కొల్చారం

సంగారెడ్డిలో శుక్రవారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో అండర్ 17 బాలికల విభాగంలో రంగంపేటకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎస్. అక్షయ ప్రతిభను కనబర్చారు. హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొనుటకు అక్షయ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ విద్యార్థిని అక్షయను అభినందించారు.

సీపీఎస్ రద్దుపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



నవతెలంగాణ-నిజాంపేట : సీపీఎస్‌ను రద్దుపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు మెంగర్తి ప్రణీద్ కుమార్ స్పష్టం చేశారు. మండల స్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షులు ప్రణీద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, రాష్ట్ర నాయకులు రవీందర్ గౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్, జిల్లా బాధ్యులు ఇంద్రసేన చారిలు పాల్గొని విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ఉద్యోగులకు సంబంధించిన పలు కీలక ప్రకటనలు చేయడం పట్ల హర్షం ప్రకటించారు. ముఖ్యంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనుకుంటున్నట్లు ఒక సహేతుకమైన నిర్ణయాన్ని ప్రకటించడం మంచి పరిణామమన్నారు. అదేవిధంగా పెండింగులో ఉన్న 3 డిఎలు కూడా త్వరలోనే విడుదల చేస్తామని చెప్పడం కూడా సంతోషకరమన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా పి ఆర్ సి సిఫార్సులను 6 నెలల్లోనే అమలు చేయడానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన వీటన్నిటిపై ఉత్తర్వులను వెంటనే జారీ చేసి వారి చిత్తశుద్ధిని చాటుకోవాలని టీఆర్‌టీఎఫ్ పక్షాన కోరారు.

30న జాతీయ లోక్ అదాలత్

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ లక్ష్మి శారద



నవ తెలంగాణ-మెదక్ టౌన్

జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 30వ తేది శనివారం మెదక్ జిల్లా కోర్ట్ ప్రాంగణంలో నిర్వహించనున్నామని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ లక్ష్మి శారద తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఐడెంటిఫైడ్ అండ్ పెండింగ్ కేసులకు సంబంధించి జిల్లా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ లక్ష్మి శారద పాల్గొని మాట్లాడారు. 30వ తేదిన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, ఇన్సూరెన్సు కేసులు, భార్యభర్తల కేసులు, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, మొదలగు కేసులను సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా రాజీ కుదుర్చుకునే కేసులలో రాజీ కుదుర్చుకోవడం కోసం కక్షిదారులు తమ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించుకునే విధంగా చూడాలని తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రజలు, కక్షిదారులు వినియోగించుకొని తమ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జితేందర్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రిటా లాల్ చంద్, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ కల్పన, అడిషనల్ ఎస్పీ మహేందర్, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, డిస్ట్రిక్ట్ రెవిన్యూ ఆఫీసర్ పద్మశ్రీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ ఫజల్ అహ్మద్, పోలీస్ సిబ్బంది కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



నవతెలంగాణ-మెదక్

గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల పంచాయతీ కార్యదర్శులు తీవ్రంగా నష్టపోయి సర్వీసు కోల్పోయారని, వారందరికీ కొత్త ప్రభుత్వం న్యాయం చేయాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు జంగం నగేష్ ఆధ్వర్యంలో అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం అప్పటి పంచాయతీరాజ్ కమిషనర్ ఒక ప్రొసీడింగ్ తీసుకొచ్చిందన్నారు. 2023 సెప్టెంబర్ 15న వచ్చిన ప్రొసిడింగ్ ప్రకారం గ్రేడ్‌లు లేవని, కానీ 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జారీ చేసిన జీవో 81, 84 ప్రకారం క్యాడర్ స్ట్రెంత్‌ను పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు జరిపారన్నారు. గత ప్రభుత్వం పాత నిబంధనలను పట్టించుకోకుండా కేటాయింపు జరపడం వల్ల కార్యదర్శులు స్థానికతను శాశ్వతంగా కోల్పోవాల్సి వచ్చిందన్నారు. దాంతో పంచాయతీరాజ్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, సంఘటితంగా అన్ని సమస్యలను సాధించుకుందామని కోరారు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శిగా సంతోష్

పంచాయతీ కార్యదర్శుల ఫోరం నూతన జిల్లా కార్యదర్శిగా రిబ్బ సంతోష్ కుమార్‌ను ఎన్నుకుంటూ జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్ ప్రకటించారు. గత సంవత్సర కాలంగా ఇదివరకు ఎన్నుకున్న కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి వరుసగా మూడు పర్యాయాలు కార్యవర్గ సమావేశాలకు హాజరు కానందున అతడిని తొలగించి ఆ స్థానం భర్తీ కోసం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించి రిబ్బ సంతోష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొని సంబంధిత ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యండి. ఫజలుద్దీన్, ప్రచార కార్యదర్శి నర్సింలు, క్రీడల కార్యదర్శి గోపాల్, మెదక్ యూనిట్ అధ్యక్షులు పంపరి శివాజీ, రామాయంపేట యూనిట్ అధ్యక్షుడు ఆనుముల ప్రభాకర్, అల్లాదుర్గ్ యూనిట్ అధ్యక్షులు ధర్మాచందర్, నాంపల్లి కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యువజనోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు

నవతెలంగాణ-మెదక్

జిల్లాస్థాయి యువజనోత్సవాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఆర్.నాగరాజు తెలిపారు. యువజన సర్వీసుల శాఖ సంచాలకులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు మెదక్ పట్టణంలోని వైస్రాయి గార్డెన్స్ లో జిల్లా స్థాయి యువజనోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సొంత ఆర్కే స్ట్రాతో వచ్చిన జట్టుకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా స్త్రీ, పురుషులకు ఆయా విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతాయన్నారు.

సాంస్కృతిక పోటీలు:

జానపద నృత్యం (10 మందికి మించరాదు), జానపద పాట, జానపద నృత్యం (వ్యక్తిగతం /సోలో) 5 మందికి మించరాదు. జానపద పాట (వ్యక్తిగతం/సోలో).

లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్ పోటీలు:

కథా రచన, పోస్టర్ మేకింగ్, స్పీచ్, ఫోటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్గదర్శకాలు అనుసరించి పోటీలలో ప్రథమ స్థానం పొందిన ఒక జట్టును జిల్లా స్థాయిలో ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ఎంపికైనవారు 2024 జనవరి 12వ తేదీ నుంచి 16 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించబడుతుందన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు ఉండి మెదక్ జిల్లా నివాసి అయి ఉండి, అర్హతలు గలవారు జనన ధృవీకరణ పత్రం లేదా పదో తరగతి మెమో, ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ 3 ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 20వ తేది సాయంత్రం 4 గంటల లోపు మెదక్ కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం 9347344440, 9494825665, 9493594388 లను సంప్రదించాలన్నారు.

జోగిపేటలో స్కూటి చోరీ

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలోని బృందావన్ కాలనీలో స్కూటీ చోరీకి గురయ్యింది. జోగిపేట పట్టణంలోని బృందావన్ కాలనీకి చెందిన సింగారపు సంతోష్ కుమార్ శనివారం మధ్యాహ్నం తన స్కూటీ (టీఎస్35ఎ7562)ను ఇంటి ముందర పార్క్ చేసి ఇంట్లోకి వెళ్ళాడు. పది నిమిషాల్లోనే వచ్చి చూసే సరికి ఓ వ్యక్తి అతని వాహనాన్ని దొంగతనం చేసి పారిపోయాడు. జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సింగారపు సంతోష్ కుమార్ తెలిపారు.

పంచాయతీ పోరుకు మోగనున్న నగారా

- మరో 45 రోజుల్లో ముగియనున్న పదవీ కాలం
- ఎన్నికల నిర్వహణపై దృష్టిసారించిన జిల్లా యంత్రాంగం
- మూడు విడుతల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల పోరుకు నగారా మోగనుంది. మరో 46 రోజుల్లో పాలకవర్గం పదవి కాలం ముగియనున్న నేపథ్యంలో స్థానిక సంగ్రామానికి రాష్ట్ర ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది వివరాలను టి పోల్ సాఫ్ట్ వేర్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఎన్నికలను మూడు విడుతల్లో నిర్వహించే అవకాశాలున్నాయి. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారా, లేక తరువాత నిర్వహిస్తారా అనేది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉందని అధికార వర్గాలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లాలో 21 మండలాలు, 469 గ్రామ పంచాయతీలు ఉండగా, 4086 వార్డు స్థానాలు ఉన్నాయి. 2024 ఫిబ్రవరి 1వ తేదీతో గ్రామపంచాయతీల్లోని సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఐదేళ్ల పదవి కాలం పూర్తికానుంది. మూడు నెలల ముందే ప్రారంభం కావాల్సిన ఎన్నికల కసరత్తు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడాల్సి వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు కుదిరితే జనవరి, ఫిబ్రవరి నెలలో, లేదంటే ఏప్రిల్ నెలలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం మరో 46 రోజుల్లో పూర్తికానుంది. జనవరి చివరి వారం, ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగకుంటే ప్రత్యేకాధికారుల పాలన కొనసాగే ఆస్కారం ఉంది.

దృష్టిసారించిన జిల్లా యంత్రాంగం

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది, ఓటర్ల జాబితా తదితర ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. రిటర్నింగ్ అధికారులతో పాటు ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వివరాలను తెలంగాణ పోల్ సాఫ్ట్ వేర్‌లో నమోదు చేసి ఈ నెలాఖరువరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రతీ 200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారిని, 200 నుంచి 400 మంది లోపు ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ఇద్దరు పోలింగ్ అధికారులు, 400 నుంచి 650మంది లోపు ఓటర్లుంటే ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించనున్నారు. 650 మంది కంటే ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉంటే రెండు పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నారు.

రిజర్వేషన్లలపై ఉత్కంఠ

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల రిజర్వేషన్లలపై ఉత్కంఠత నెలకొంది. గత ఎన్నికల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు జరిగే ఎన్నికల్లో ఒకే రిజర్వేషన్ వర్తించేలా అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడం జరిగింది. అయితే ప్రస్తుతం కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే రిజర్వేషన్ కొనసాగిస్తదా లేక ఓటరు జాబితా ఆధారంగా కులాల వారీగా ఓటరు జాబితా ప్రకారం కొత్తగా రిజర్వేషన్లను ఖరారు చేస్తారా అనేది తెలియాల్సి ఉంది.

విద్యార్థులకు విషజ్వరాలు.. పర్యవేక్షించని అధికారులు

- వసతి గృహాల్లో మెడికల్ క్యాంప్ నిర్వహించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్



నవతెలంగాణ-మెదక్

ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు విషజ్వరాలు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని, వెంటనే జిల్లా అధికారులు స్పందించి మెడికల్ క్యాంప్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడిన మార్పుల వలన గురుకులాలు, కేజీబివి, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు విష జ్వరాలు, చర్మ వ్యాధుల భారినపడి అనారోగ్యానికి గురై అవస్థలు పడుతున్నారన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, కనీసం మెడిసిన్ అందుబాటులో లేకుండా పోయిందని, జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. హాస్టల్ వార్డెన్లు విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తున్నారని, అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆసుపత్రిలో చూపించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గురుకులాలలో కేజీబీవీలలో ఏఎన్ఎంలు లేకుండా పోయారని, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం విద్యార్థులకు శాపంగా మారుతుందన్నారు. జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినా విద్యార్థుల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపిస్తున్నారన్నారు. జిల్లాలో తాగడానికి మంచినీరు లేని హాస్టళ్లు చాలా ఉన్నాయని, తాగే నీటి వలన ఇన్ఫెక్షన్ సోకి విద్యార్థులకు చర్మవ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రతి హాస్టల్‌లో మినరల్ వాటర్ అందుబాటులోకి తీసుకురావాలని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టి డిఎంహెచ్ఓ ఆఫీస్ ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జగన్, సహాయ కార్యదర్శి అజయ్, జిల్లా నాయకులు రవి పాల్గొన్నారు.

పంచాయతీల ఏర్పాటుపై కార్యాచరణేది?



నూతన గ్రామపంచాయతీలను వెంటనే ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిజాంపేట

గత నాలుగు నెలల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయాలని ప్రొసిడింగ్‌లను అందజేశారు. తిప్పనగుల్ల గ్రామపంచాయతీ నుంచి "షౌకత్ పల్లి", రజాక్ పల్లి గ్రామపంచాయతీ నుంచి "కాసిం పూర్ తాండా"ను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం ప్రొసీడింగులు అందజేశారు. ఇప్పటికీ ఎలాంటి కార్యాచరణలేదని, ప్రభుత్వం గజిట్ ఎప్పుడు జారీ చేస్తుందో ఏమో తెలియడం లేదంటూ లంబాడి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే సర్పంచుల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం వెంటనే నూతన గ్రామ పంచాయతీలను ప్రకటించాలని, గజిట్ విడుదల చేయాలని రెండు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తమ తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లయితే తమ నిధులను తామే వినియోగించుకొని, తండాలను అభివృద్ధి చేసుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీలుగా ప్రకటించి గజిట్ జారీచేసి వెంటనే కార్యాచరణ చేపట్టాలని పలువురు తండావాసులు కోరుతున్నారు.

గజిట్ జారీ చేయాలి

ధరావత్ రామచందర్, కాసిం పూర్ వాసి



మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి కాసింపూర్ తాండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రొసిడింగ్ అందజేయడం జరిగింది. ఇప్పటికీ ఎలాంటి కార్యాచరణ లేదని సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కాసింపూర్ తండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి గజిట్ జారీ చేయాలి. తమ నిధులు తాము వినియోగించుకొని తమ తాండాలను అభివృద్ధి చేసుకుంటాము.

అభివృద్ధి చేసుకుంటాం

సూరా రాములు, షౌకత్ పల్లి వాసి



తిప్పనగుల్ల గ్రామపంచాయతీ నుంచి షౌకత్ పల్లి గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ప్రొసీడింగ్ పత్రాలను అందజేయడం జరిగింది. అధికారులు పాలకులు వెంటనే స్పందించి షౌకత్ పల్లి గ్రామపంచాయతీని వెంటనే ఏర్పాటు చేసి గజిట్ విడుదల చేయాలని కోరుతున్నాను. గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసినట్లయితే అభివృద్ధి చేసుకుంటాం.

ఉగాధి కోల్పోయామని ఆటో కార్మికుల మహాధర్నా





నవతెలంగాణ-రామాయంపేట

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం పథకంతో తాము ఉపాధి కోల్పోయామని ఆటో కార్మికులు శనివారం రామాయంపేట పట్టణంలో పెద్ద ఎత్తున మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. నిజాంపేట, రామాయంపేట మండలాల ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మా భరోసా మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటో డ్రైవర్లు ఆటోలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట క్రాస్ రోడ్డు వద్ద బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామన్నారు. ఆటోల ఫైనాన్స్ డబ్బులు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆటో నడవదు.. పూట గడవదు

- కుటుంబాన్ని పోషించేది ఎట్లా?
- ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో కార్మికుల వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట

ఆటో నడపదు పూట గడవదు కుటుంబాన్ని పోషించేది ఎట్లా అంటూ మండల పరిధిలోని ఆటో కార్మికులు తమ ఆవేదన వెలిబుచ్చారు శనివారం రామాయంపేట రెవెన్యూ డివిజన్‌లో తలపెట్టిన ఆటో కార్మికుల సమ్మెకు నిజాంపేట మండల కేంద్రం నుంచి ఆటో యూనియన్ల కార్మికులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో మహిళలు ఆటోలలో ఎవరు రావడం లేదన్నారు. తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కష్టపడి ఆటోలను నడిపించుకుంటేనే తమ పొట్ట గడుస్తుందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం మంచి సౌకర్యమైనప్పటికీ, తమ ఆటోలు నడిచేది ఎట్లా, ఆటోలు నడిస్తేనే తమ కుటుంబాలను బతికించుకుంటామన్నారు. లేకుంటే ప్రభుత్వం ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలని, లేనియెడల ఆటో కార్మికులకు నెలనెలా పింఛను మంజూరు చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ పాషా, జాల పోచయ్య, అయ్యవారు సాయికిరణ్, గౌస్ పాషా, పంజా బాలరాజ్, ఎండి బాబు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులూ..సోషల్ మీడియాతో జర జాగ్రత్త



నవతెలంగాణ-మెదక్ టౌన్

విద్యార్థులు సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జ్ రిటా లాల్ చంద్ సూచించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ అక్షరాస్యత శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి రిటా లాల్ చంద్ విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ అమ్మాయిలు కనీస వయసు రాకముందే పెళ్ళి చేసుకుంటే, కలిగే ఇబ్బందుల గురించి వివరించారు. విద్యార్థులు వాట్సాప్, ఇంస్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో ఎలాంటి ఫొటోస్, వీడియోస్‌లను షేర్ చేయవద్దని సూచించారు. ఫోక్సో చట్టంకు సంబంధించి చిన్న పిల్లలను శారీరకంగా వేదిస్తే 6 సంవత్సరాల నుంచి జీవితకాలం జైలు శిక్ష ఉంటుందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని పిల్లలందరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని చెప్పారు. ప్రతి విషయంలో మంచి చెడులు ఏంటో తల్లితండ్రులను అడిగి తెలుసుకోవాలని వివరించారు. ఈ సదస్సులో చైల్డ్ అభ్యుస్, చైల్డ్ యాక్ట్ ఇతర అంశాలపై జిల్లా న్యాయ సేవాదికార సంస్థ అనేది ప్రజల కోసం ఉచితంగా న్యాయ వాదిని ఏర్పాటు చేసి న్యాయం చేస్తారన్నారు. వివిధ చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వసంతి, కళాశాల సిబ్బంది, సిద్దా గౌడ్, సిద్ధిరాములు, సఖి టీం మెంబెర్, విజయ్, షీ టీం, భరోసా టీమ్ మంజుల, పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.



శ్రీ చైతన్య స్కూల్లో మంటలేని వంట ప్రదర్శన



నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక శ్రీ చైతన్య పాఠశాల బ్రాంచ్ 1 లో ప్రీ ప్రైమరీ చిన్నారులు మంటలేని వంటలను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఏజాజ్ అలీ వాటిని తిలకించిన అనంతరం మాట్లాడుతూ వివిధ రకాల పండ్ల హారాలను ప్రదర్శించి, మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే ఫ్రూట్స్ ఎంతో ఉపయోగపడతాయని, మనిషి జీవితకాలన్ని పెంచుతా యని, ప్రదర్శన ద్వారా వివరించారని తెలిపారు. ఫ్రూట్స్ అలవాటు చేసుకోవాలని, జంక్ ఫుడ్ తిరస్క రించాలని విద్యార్థులకు సూచించారు. విటమిన్లు, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయని, మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే ఇలాంటి ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ కర్ణాకర్ రెడ్డి, ప్రైమరీ ఇన్చార్జి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జిలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పార్టీ ద్రోహులను కాంగ్రెస్‌లోకి తీసుకోం



నవతెలంగాణ-నంగునూరు

కోవర్టులను, పార్టీ ద్రోహులను కాంగ్రెస్‌లోకి తీసుకోమని ఆ పార్టీ మండల అధ్యక్షులు తప్పేట శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి, పదవులు అనుభవించి అధికారం పోగానే బీఆర్ఎస్‌లోకి పోయి, అక్కడ కూడా అధికారం చెలాయించి, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకిరాగానే మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తానంటూ నియోజకవర్గ నాయకుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసిందన్నారు. జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులకు చెపుతున్నామని తెలిపారు. మండల నాయకులకు తెలియకుండా పార్టీ ద్రోహులనుగానీ, కోవర్టులను పార్టీలోకి తీసుకోవద్దన్నారు. ఎవరు పడితే వారు మంత్రుల దగ్గరకు పోయి శుభాకాంక్షలు తెలిపి ఫొటోలు దిగి, వారికీవారే పార్టీలోకి చేరినట్లు చెప్పుకొని తిరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తన్నీరు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. గజ్వేల్ నేతలు శనివారం ఎమ్మెల్యేలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. క్యాడర్ అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గెలవడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఎప్పటికప్పుడు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నర్సింగారావు, అమరేందర్ రావు, మల్లేశం గౌడ్, నాగరాజు గౌడ్, మామిడి శంకర్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

- ఎంపీపీ సాయిలు సమావేశంలో అసహనం



నవతెలంగాణ-మిరుదొడ్డి

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ పేరుతో తూతూ మంత్రంగా అధికారులు సమావేశం నిర్వహించి చేతులు దులిపేసుకుంటున్నారని ఎంపీపీ సాయిలు అసహనం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పనులు చేయిస్తుంటే, అధికారులు మాత్రం సోషల్ ఆడిట్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. మిరుదొడ్డి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో రాజి రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవ్ ఆర్య హాజరయ్యారు. మండల స్థాయి సామాజిక తనిఖీ సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపీపీ సాయిలు సమావేశంలో అసహనం వ్యక్తం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కేవలం మొక్కుబడిగా సామాజిక తనిఖీ పేరుతో అధికారులే రివ్యూ నిర్వహించుకొని వెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. స్థానిక సర్పంచులకు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. గ్రామాల్లో జరిగిన అవినీతిపై నిలదీస్తారనే ఉద్దేశంతో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రజా ప్రతినిధుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా సామాజిక తనిఖీ ఉండాలన్నారు. ప్రభుత్వం ఏదైతే లక్ష్యంతో డబ్బులు గ్రామాభివృద్ధికి వెచ్చిస్తుందో, పూర్తిగా ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక తనిఖీ సమావేశాన్ని బహిష్కరించి ఎంపీపీ సాయిలు వెళ్లిపోవడంతో అధికారులు తర్వాత సమావేశాన్ని యథావిధిగా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు ఓబులేష్ , బాలరాజ్ , జిల్లావిజిలెన్స్ ఆఫీసర్ ప్రభాకర్ ఎండి ఆరిఫ్ జే క్యూ సి సంతోష్ రెడ్డి ,ఎంపిడిఓ రాజిరెడ్డి,సుపరింటెంట్ నారాయణ, టెక్నికల్ కొండల్ రెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోచయ్య



నవతెలంగాణ-బెజ్జంకి

కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ ఏఎంసీ చైర్మన్, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు అక్కరవేణి పోచయ్య నియమాకమైనట్టు మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి శనివారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రెండో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ నాయకులకు పోచయ్య కృతజ్ఞతలు తెలిపారు.

బెతేస్థ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-బెజ్జంకి

క్రైస్తవం మతం కాదని మానవులు తమ జీవనశైలిలో మార్పు చెందడానికి సూచించే సత్య మార్గమని, బైబిల్ మతగ్రంథం కాదని, మానవాలికి జ్ఞానమందించే మహాజ్ఞాన స్వరూపిణి అని పాస్టర్ బోష ప్రభాకర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో బెతేస్థ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ వేడుకలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గొంగళి పురుగు ఆకృతి, సీతాకోకచిలుక ఆకృతి వేరువేరుగా ఉన్న వాటిలో ఉండే జీవం ఒక్కటేనని, ప్రాంతాలు, కులాలు, భాషలు వేరైనా, మానవాళి అంత ఒక్కటేనని, మానవాళిని సత్యమార్గంలో నడిపించడమే క్రైస్తవ మార్గమని పాస్టర్ ప్రభాకర్ అన్నారు. సమాజంలో ఒకరిపై ఒకరు ప్రేమను పంచుతూ జీవనం కొనసాగించాలని బెతేస్థ ప్రేయర్ హౌస్ సంఘ సభ్యులు కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్రీస్తు సంఘం పాస్టర్ శ్రీనివాస్, సభ్యులు వెంకటరత్నం, వెంకటేశం, కుమార్, నరహరి, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

కేసీఆర్ తెచ్చారు..రేవంత్‌రెడ్డి రద్దు చేశారు

- తరలిపోతున్న పరిశ్రమలు
- ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన పరిశ్రమలు ప్రస్తుతం కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రద్దు చేస్తున్నారని తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ యుడెం కృష్ణారెడ్డి, ఎంపీటీసీల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశంలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అతిపెద్ద ఫార్మసిటీని రంగారెడ్డి జిల్లా పరిధిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి భూసేకరణ చేసి దేశంలోనే అతిపెద్ద ఫార్మసిటీగా ఏర్పాటు చేయాలనే చర్యలను గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకుందన్నారు. ఫార్మాసిటీ పనులు కూడా జరుగుతున్నాయన్నారు. పనులు కూడా చివరి దశలో ఉన్నాయన్నారు. గత కేసీఆర్ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం చేపట్టిన పనులన్నీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రద్దు నిర్ణయంతో నిలిచిపోయాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ రద్దు నిర్ణయంతో చదువుకున్న మెడిసిన్ బీఫార్మసీ విద్యార్థులలో గందరగోళం ఏర్పడిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం అన్ని రకాల పర్మిషన్లను తీసుకొని కేంద్రపరంగా అన్ని రకాలుగా ఫార్మాసిటీ నిర్మాణం కోసం అన్ని రకాల పర్మిషన్స్ లభించాయన్నారు. దాదాపు ఫార్మాసిటీలో 350 కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా ఐదు లక్షల మందికి పరోక్షంగా 10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించేవన్నారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని రద్దు చేయడంతో 15 లక్షల మందికి ఉపాధి అవకాశాలు దూరమయ్యాయని తెలిపారు. 350 కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయే ప్రమాదం ఉందన్నారు. రెండు మూడు రోజుల క్రితం 1000 కోట్ల రూపాయలతో ఐటీ కంపెనీ పక్క రాష్ట్రాలకు తరలిపోవడం చూశామన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐటి ఫార్మా కంపెనీలను కాపాడుకొని ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా ప్రణాళికలను రూపొందించుకొని తెలంగాణ రాష్ట్రానికి ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకొని అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం సంతోషకరమని తెలిపారు. ఈ పథకం అమలుతో ఆరు లక్షల ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆటో డ్రైవర్లు రోజుకో విధంగా ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం ప్రతి సంవత్సరం పెట్టుబడి సహాయం కింద నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో రైతుబంధు రైతుల ఖాతాల్లో వేసేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతుబంధు పెట్టుబడి సహాయం రైతు ఖాతాలలో జమ చేయలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి వెంటనే రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేయాలని కోరారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. సమావేశంలో మండలాల పార్టీ అధ్యక్షులు బెండ మధు, కరుణాకర్ రెడ్డి, నూనె కుమార్ యాదవ్, రామచంద్రం, దుర్గయ్య రామకృష్ణారెడ్డి, కిషన్ రెడ్డి, గుంటుక రాజు, నవాజ్ మీరా తదితరులు ఉన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటో కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని ఆటో క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు సాయిరాం డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు, అనంతరం పాత బస్టాండ్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆటోలకు ఉపాధి తగ్గిందన్నారు. ఆర్థికంగా ఆటోవాలాల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులందరినీ ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో సంఘం నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎస్సీ ఎస్టీ గజిటెడ్ల అధ్యక్షుడిగా రామచంద్రయ్య



నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చరిత్ర అధ్యాప కుడిగా పనిచేస్తున్న గొల్లురి రామచంద్ర య్యను సిద్దిపేట జిల్లా అధ్యక్షు లుగా నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు బరిగెల నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోంటి రవి ప్రకటించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారానికి, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపట్ల విశ్వాసం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నిషేధం

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పురపాలక సంఘం పరిధిలో నివసిస్తున్న ప్రజలు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంపై గతంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించాయని, ఎవరూ ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా సిద్దిపేట పురపాలక సంఘం పరిసరాలలో నిషేధిత ప్లాస్టిక్‌ను వాడుతున్నారని అధికారుల దృష్టికి వచ్చిందని, పరిసర ప్రాంతాలలోని ఖాళీ ప్రదేశాలలో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయడం అధికారులు గమనించారని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అమ్మడం, అక్రమంగా నిల్వ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడానికి ఇన్ఫోర్స్మెంట్ టీములు ఏ సమయంలోనైనా తనిఖీలు చేస్తారని తెలిపారు. తనిఖీలలో దొరికినట్లయితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి



నవతెలంగాణ-బెజ్జంకి

పదేండ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో ప్రభుత్వ వైఫల్యాలను, అక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన కాంగ్రెస్ శ్రేణులపై బీఆర్ఎస్ శ్రేణులు నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కేకేసీ తెలంగాణ సోషల్ మీడియాకో ఆర్డీనేటర్ మెట్ట నాగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేసిందన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌లో రాణించిన నర్మేట విద్యార్థులు



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో నంగునూరు మండలం నర్మేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాణించారు. ఈనెల 13 నుండి 15 వరకు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో జరిగిన 67వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్ 14 బాలికల విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల నర్మేట నుండి తొమ్మిదవ తరగతి చదువుతున్న పోచమ్మ, కాడిపిల్లి శిరీష, ఏడవ తరగతి చదువుతున్న పోచమ్మ కాడిపిల్లి శివాని పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచారు. ఇంత పెద్ద విజయం అనేది మెదక్ జిల్లాలో ఇదే ప్రథమం కావడం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ విజయం మన మెదక్ జిల్లా కు, సిద్దిపేట జిల్లాకు నర్మేట పాఠశాలకు వారి తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలను మంచి పేరును తీసుకువచ్చారు. గ్రామ సర్పంచ్ అజీజ్, ఉపసర్పంచ్ గంధమాల కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ డాక్టర్ వెంకన్న, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పోటీల్లో గెలిచిన వారిని అభినందించారు.రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.చక్కటి శిక్షణను ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు క్యాతం రాజ్ కుమార్ ను, గెలిచిన వారిని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అభినందించి సన్మానించారు.

మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలి



నవతెలంగాణ-బెజ్జంకి

మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి శనివారం డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బెజ్జంకి మండలాన్ని సిద్దిపేట జిల్లాలో కలిపి ఇన్నాళ్లు ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, గతంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మండలాన్ని తిరిగి కలుపుతామని ఇచ్చిన హామీ ప్రకారం మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని మహిపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అన్ని రంగాల్లో తొమ్మిదో వార్డు అభివృద్ధి



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని తొమ్మిదో వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు కౌన్సిలర్ మామిడి విద్యా రాణి శ్రీధర్ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మహిళలకు పెన్షన్లు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్టు లాంటి పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. కెసిఆర్, హరీష్‌రావు నాయకత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఇంటింటికి తాగునీరు అందించిన ఘనత కేసిఆర్కే దక్కిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి గత నాలుగు సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి అంటే కెసిఆర్ గుర్తుకొస్తున్నారని చెప్పారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

మిట్టపల్లి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన మాజీ సుడా చైర్మన్


- కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని, డెవలప్మెంట్ పేర వైస్ చైర్మన్ రమణాచారితో కలిసి రూ.కోట్లు దండుకున్నారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మిట్టపల్లి గ్రామంలోని పలు సర్వేనెంబర్లలో ప్రభుత్వ భూమి ఉందని, దాదాపు 30 ఎకరాలకుపైగా భూమిని సుడా మాజీ చైర్మన్ ఎలా రిజిస్ట్రేషన్ చేసుకుంటారన్నారు. 30 ఎకరాల కబ్జాపై అర్బన్ తహసీల్దార్‌పై కూడా విచారణ జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టబోమని అన్నారు. సిద్దిపేట అర్బన్ డెవలప్మెంట్ పేరు మీద సుడా వైస్ చైర్మన్ రమణాచారి వివిధ పనుల నిమిత్తం లక్షల రూపాయలు సొమ్ము కాజేశారని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికారులు, పాలకులు దోచుకో.. దాచుకో అన్నట్టుగా వ్యవహరించారని మండిపడ్డారు. ఎవరి జాగీరని ప్రభుత్వ స్థలాలు కబ్జా చేశారని, ప్రజల నిధులను కాజేస్తారని మండిపడ్డారు. వీటికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, ఆధారాలను ప్రభుత్వానికి అప్పగిస్తానని అన్నారు. అవినీతికి పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షులు మజార్ మాలిక్, పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన అధ్యక్షులు గయాజుద్దీన్, నాయకులు నజ్జు, నవాజ్, యాదగిరి, ప్రశాంత్, ఫయాజ్, నాని తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు మహిళా కళాశాల విద్యార్థిని శృతి ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే గణతంత్ర వేడుకలకు స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న రంగు శృతి ఎంపికైంది. జాతీయ సేవా పథకంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీలో అక్టోబర్ 9న జరిగిన శిబిరంలో వివిధ అంశాలలో శృతి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. నవంబర్ 1 నుండి 10 వరకు విజయవాడలో జరిగిన ముందస్తు రిపబ్లిక్ డే ఎంపిక శిబిరంలో పాల్గొన్న 30 మందిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రిపబ్లిక్ డే పరేడ్ కు ఎంపికైంది. శృతి ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జీవన్ కుమార్ శృతిని అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. సీతారాములు, కోఆర్డినేటర్ డాక్టర్ కే. స్రవంతి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సామ సువర్ణా దేవి, సహాయ ఆచార్యులు కిషోర్, అధ్యాపకులు హరి ప్రసాద్, జ్యోతి, స్వప్న, తిరుపతి, ఇందిర, బాల్ లక్ష్మి, ఆఫీసు సిబ్బంది చాంద్, శ్రీనివాస్, ఇలియాజ్, అయోధ్య, సత్యం తదితరులు ఆమెను అభినందించారు.

గజ్వేల్‌లో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తామని చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను ప్రజలు గమనించి కేసీఆర్ ను గెలిపించారన్నారు. గత ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు కేసీఆర్ నాయకత్వంలో పెద్దపీట వేశామన్నారు. ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు అందిందని చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నామని చెప్పారు. పార్టీలకతీతంగా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రింగురోడ్డు, కోట మైసమ్మ రోడ్డు, అండర్ డ్రైనేజ్ పనులను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రత్యేక చొరవతో కోమటిబండ వద్ద మిషన్ భగీరథ ఏర్పాటు చేసి గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామన్నారు. రైతులకు మల్లన్నసాగర్, కొండ పోచమ్మ జలాశల ద్వారా నీరు అందిస్తున్నామని తెలిపారు.

దళితులకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



నవతెలంగాణ-రాయపోల్

కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న దళితులు వారి బతుకులు మారుతాయని, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మొదటి ప్రభుత్వం గత పదేళ్ళుగా అంతులేని నిర్లక్ష్యం, వివక్షను కొనసాగించిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రచార అర్భాట పథకాలతో ఎన్నో ఆశలు కల్పించింది. ఏ పథకాన్ని సైతం పూర్తిగా కొనసాగించలేదన్నారు. దళితుల నిధులను దారి మళ్ళించమని ఎన్నికల మ్యానిఫెస్టోలో వల్లేవేసిన కేసీఆర్ నిధులను యథేచ్ఛగా దారి మళ్ళించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు కావడంతో మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. చేయూత గ్యారంటీ పథకంలో రాజీవ్ వైద్య ఆరోగ్య సేవలకు పది లక్షల ఆర్థిక సహాయాన్ని పెంచి సియం రేవంత్ మాట నిలబెట్టుకున్నారన్నారు. సంక్షేమ రాజ్య ఫలాలను దళితుల దరికి చేర్చాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే పాఠశాలల పటిష్టత

నవతెలంగాణ-కొండపాక



సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలు పటిష్టంగా తయారవుతాయని పిఎస్ఆర్ సంస్థ చైర్మన్ పోల్కంపల్లి నరేందర్ అన్నారు. కుకునూరు పల్లి ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని వినూత్నంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆట పాటలు, తల్లిదండ్రులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్య మాట్లాడుతూ విద్యార్థుల చదువును ఇంటి వద్ద పరీక్షించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత ఇంటి వద్ద చదివే విధంగా శ్రద్ధ కనపరచాలన్నారు. పాఠశాలలో అమలవుతున్న ఉన్నతి కార్యక్రమం ద్వారా విద్యార్థులను మూడు గ్రూపులుగా చేసి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎల్ఈడి టీవీని సర్పంచ్ జయంతి నరేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ఎంపీటీసీ కావ్య దుర్గయ్య



నవతెలంగాణ-జగదేవపూర్

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంపీటీసీ కావ్య దుర్గయ్య సూచించారు. జగదేవపూర్ మండలంలోని చాట్లపల్లి గ్రామంలో శనివారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చంద్రం, ఎస్.ఎమ్.సి చైర్మన్ బరిగే నర్సింలు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీటీసీల ఫోరం మండల బాధ్యులు కావ్యాదర్గయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుల్లో విద్యార్థుల తీరును ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. రాత్రి సమయాల్లో విద్యార్థులు చదువుకునే సమయంలో టీవీలను వాడకూడదన్నారు. ఉపాధ్యాయులతో తల్లిదండ్రులు అందుబాటులో ఉంటూ విద్యార్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు పరీక్షించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అలాగే విద్యార్థుల క్రీడ నైపుణ్యాలను కూడా పరిశీలించి ప్రతిభను వెలికి తీయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తాయన్నారు . ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎగుర్ల కనకయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు గోక నర్సింలు, మాసురి రమేశ్, భుమల్ల రాజు, పద్మ, పబ్బోజు శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని నెంటూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ యువకులు గజ్వేల్- ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంగు ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా నెంటూర్ గ్రామానికి బస్సు రావడం లేదని, బస్సు సౌకర్యం లేనందున విద్యార్థులు, ఉపాధి కోసం పొరుగు గ్రామాలకు వెళ్ళే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఎంకు వినతిపత్రం అందించిన వారిలో ఎర్రవల్లి భాను, పాండు, మధు గౌడ్, తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం


మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు



నవతెలంగాణ-మిరుదొడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని తెలిపారు కార్యకర్తలు నిరుత్సాహపడకుండా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ సారాధ్యంలో బీజేపీ విజయ డంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాలేష్ గౌడ్, శ్రీనివాస్, రోశయ్య, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ ఎస్ ఎన్ చారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, బొంపల్లి అక్బర్‌పేట మండలాధ్యక్షుడు అరిగే కృష్ణ, దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు కృష్ణమ్మ గారి సుభాష్ రెడ్డి, జిల్లా నాయకులు మచ్చ శ్రీనివాస్, వెంగళరావు, జిగిరి అమర్.భిక్షపతి, దూల వెంకట్ గౌడ్, చింత సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగులందరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

బాధ్యతతో విధులు నిర్వర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాల్సిన అవసరం మన ఉద్యోగులపైన ఎంతైనా ఉందని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఎండి జావేద్ అలీ, జిల్లా కార్యదర్శి బి.రవి లు పేర్కొన్నారు. శనివారం టీఎన్జీవోల సంఘం పటాన్‌చెరు తాలూకా యూనిట్ సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో తాలూకా టీఎన్జీవోస్ అధ్యక్షులు యం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు ఎండి జావేద్ అలీ, జిల్లా సెక్రెటరీ బి. రవి హాజరు కావడం జరిగినది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ఉద్యోగులందరూ బాధ్యతతో పనిచేస్తే ప్రభుత్వానికి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. తాలూకాలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విధిగా తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మహేష్, కార్యదర్శి విజయ్, టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్,పటాన్ చెరు తాలూకా సెక్రటరీ సందీప్ ,కోశాధికారి కె రవితేజ ,పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం కార్యదర్శి జహీరాబాద్ తాలూక టీఎన్జీవో స్ కోశాధికారి దినేష్, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల సంరక్షణ చట్టాలపై శిక్షణ కార్యక్రమం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. ప్రభాకర్ రావు

నవతెలంగాణ-సంగారెడ్డి

చిన్నపిల్లల సంరక్షణ చట్టాలపై పోలీస్ అధికారులు, జువైనల్ శిశు సంక్షేమ అధికారులు జిల్లాలోని స్పెషల్ పోలీస్ యూనిట్స్ సభ్యులు, అడ్వకేట్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయాధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సంగారెడ్డి కె. ప్రభాకరరావు మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండని నేరం ఆరోపింపబడ్డ ప్రతి బాలుడు, బాలిక 2015 నాటి బాల నేరస్తుల పరిరక్షణ చట్టం ప్రకారం జువైనల్ జస్టిస్ బోర్డ్ ముందు విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. నేరం చేసిన తేదీ నాటికి వయస్సు ప్రమాణికమవుతుందన్నారు.అధికారిక జనన ధ్రువీకరణ పత్రం అందుబాటులో లేనట్లయితే మెడికల్ బోర్డు ధ్రువీకరింపబడ్డ వయసు ఆధారంగా కోర్టు విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటుందన్నారు. అరెస్టు చేసిన రోజు నుంచి తుది తీర్పుదాకా జేజే బోర్డు విచారిస్తుందన్నారు. ఈ బోర్డులో మొదటి శ్రేణి జ్యూడీషియల్ నియాధికారి రాష్ట్ర ప్రభుత్వం చేత నియమింపబడే ఇరువురు సామాజిక కార్యకర్తలు సభ్యులుగా ఉంటారన్నారు. ఇరువురిలో ఒకరు మహిళ మరొకరు చైల్డ్ సైకాలజిస్ట్ ఉంటారన్నారు. బెయిల్‌పై విడుదలయ్యేంతవరకు లేదా తొలి తీర్పుదాక నిందితులను ప్రభుత్వ సంక్షేమ అధికారుల పర్యవేక్షణలో అబ్జర్వేషన్ హోమ్‌లో ఉంచుతారన్నారు. నేరం రుజువైతే నిందితులకు కారాగార శిక్ష బదులుగా జేజే బోర్డు సభ్యులు మందలించి విడుదల చేయడం లేదా మూడు



సంవత్సరాలు మించకుండా సంస్కరణ గృహానికి పంపించడం జరుగుతుందన్నారు. విడుదల చేసి కొన్నాళ్లపాటు మంచి ప్రవర్తనకై జిల్లా ప్రొబేషనరీ అధికారి పర్యవేక్షణలో ఉంచటం లేదా సామాజిక సేవ చేసే ఉత్తర్వులు లేదా జరిమానా చెల్లింపుకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రొవైషనరి అధికారి ఇచ్చే సామాజిక దర్యాప్తు నివేదికను పరిగణలోకి తీసుకుంటారన్నారు. ఇరువురు సభ్యుల తీర్పులో ఏకాభిప్రాయం రానట్లయితే జ్యుడీషియల్ అధికారి తీర్పు చలామణి అవుతుంది. నేరం రుజువు కాలేదని జేజే బోర్డు తీర్పు ఇస్తే దానిపై అప్పీలు లేదన్నారు. 16 ఏళ్ళు పై బడిన నిందితుల కేసులో లేదా అతిహేయమైన నేరం చేసిన కేసులో మాత్రమే అపీలు



ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి,జి. సుదర్శన్, అదనపు జిల్లా న్యాయమూర్తి సునీత రవీంద్ర రెడ్డి, అడిషనల్ ఎస్పీ పి.అశోక్, సెక్రటరీ జిల్లా న్యాయ సేవాదికర సంస్థ జె. హనుమంతరావు, సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. రాధా కృష్ణ చౌహాన్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్ పి.లక్ష్మణా చారీ, జూనియర్ సివిల్ జడ్జ్, జువెనైల్ జస్టిస్ కోర్టు శాలిని సకెల్లి , జూనియర్ సివిల్ జడ్జ్, ఎక్సైజ్ ప్రోహిబిషన్ కోర్టు పట్లోళ్ళ తేజశ్రీ, ప్రెసిడెంట్ బార్ అసోసియేషన్ సంగారెడ్డి ఏ. విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సంధ్య రాణి పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యాభ్యాసంలో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలి

- డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-వర్గల్

విద్యార్థుల విద్యాభ్యాసంలో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ గౌడ్ అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈఓ శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాల విద్యలో తల్లిదండ్రుల ప్రాముఖ్యతను పెంచుతూ నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో వర్గల్ జెడ్పీహెచ్ఎస్ రాష్ట్రస్థాయిలోనే ప్రశంసలు అందుకుందన్నారు. పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి దాదాపు 150 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సౌకర్యాలు, నైపుణ్యం, సాంకేతికత, బోధనాపరంగా ఎవరికీ తీసిపోవన్నారు. ప్రపంచంలో వేగంగా మారుతున్న సాంకేతికత విశిష్టతను గుర్తించి తననుగుణంగా ఉపాధ్యాయులను శిక్షణ ద్వారా నిష్ణాతులను చేసి విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నామన్నారు. నిరంతర పర్యవేక్షణ, సూచనల ద్వారా విద్య పరిపుష్టం అవుతుందన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఉత్తీర్ణత స్థాయిలను పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యాభ్యాసానికి తల్లిదండ్రుల భాగస్వామ్యం, విషయ అవగాహన, ఇంట్లో తగు వసతులు



కల్పించడం గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా మార్స్ సంస్థ అందించిన 500కు పైగా క్రీడా దుస్తులను విద్యార్థులకు అందించారు. స్పోర్ట్స్ యూనిఫామ్ అందించినందుకు మార్స్ సంస్థను అభినందించారు. ఇలాంటి ప్రోత్సాహకాలు తమకెంతో ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ దీన, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా సహాయ కార్యదర్శిగా కందికట్ల రాజు

నవతెలంగాణ-నంగునూరు



ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా కమిటీ నిర్మాణంలో భాగంగా మండలంలోని సిద్దన్నపేటకు చెందిన కందికట్ల రాజు మాదిగ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు మల్లిగారి యాదగిరి, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సామ్రాట్ ప్రకాష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వర్గీకరణ సాధించేవరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీలోనే పని చేస్తానని తెలిపారు. ఎన్ని అంటంకాలు, అడ్డంకులు వచ్చినా వర్గీకరణ సాధించేవరకు పనిచేస్తానన్నారు.

శనిగరంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శనిగరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించిన తీరు ఆకట్టుకుంది. అనంతరం ఉపాధ్యాయులుగా వ్యవహరించిన పాఠాలను బోధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎం.సరళ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి రంగనాథ్, ఎస్ఎంసీ చైర్మన్ రాజ్ మహమ్మద్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిఆర్పిలు రాజేశం, రాజు, ఎస్ఎంసి సభ్యులు, వెంకన్న, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పందిల్ల విలేజ్ పార్క్‌ను సందర్శించిన శ్రీ చైతన్య విద్యార్థులు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు శనివారం పందిళ్ళ గ్రామంలోని విలేజి పార్క్, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. విద్యార్థులను పిక్నిక్ కోసం పందిల్ల గ్రామంలోని విలేజ్ పార్క్‌కు తీసుకువచ్చి కొద్ది సమయం ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు ఆడుకోవడానికి సమయాన్ని కేటాయించారు. పిల్లలు ఎంతో ఆసక్తితో పార్కులో తమకు నచ్చిన ఆటలు ఆడుకొని ఆనందించారు.

డుమ్మా కొట్టిన అధికారులకు లెటర్ పంపండి

- అధికారులపై ఆగ్రహించిన సర్పంచులు
- సమావేశానికి సర్పంచుల భర్తలు

నవతెలంగాణ-ములుగు

సర్వసభ్య సమావేశానికి సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ హాజరై అధికారులపై ఆగ్రహించారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు లెటర్ పంపించాలని ఎంపీడీవోకు సూచించారు. శనివారం మండల పరిధిలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ లావణ్య అంజన్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మొదటిసారి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ హాజరయ్యారు. ఈ సమావేశానికి కొంతమంది సర్పంచులు మాత్రమే హాజరు కావడం గమనార్హం. అధికారిక సమావేశానికి సర్పంచుల భర్తలు హాజరైనా అధికారులు స్పందించకపోవడం గమనార్హం. అధికారులు కూడా హాజరు కాకపోవడంతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ వారికి సంజాయిషి కోరుతూ లెటర్ పంపించాలని ఎంపీడీవోకు సూచించారు. అధికారులతో మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి గ్రామాలలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్యాశాఖ సిద్దిపేట జిల్లా తెలంగాణకు ఆదర్శంగా ఉన్నదని ఇదేవిధంగా ఇకముందు కూడా ఉండాలని విద్యా అధికారులకు సూచించారు. వైసీపీ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గొర్రెల పంపిణీ చేయలేదని సర్పంచులు అడిగిన ప్రశ్నలకు కొత్త ప్రభుత్వం స్కీములను కొనసాగిస్తుందా లేదా అనేది తెలియదన్నారు. జప్తిసింగాయపల్లి నర్సాపూర్ కొట్టేయాల సర్పంచులు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు మిషన్ భగీరథ అధికారులపై మండిపడ్డారు. సర్పంచుల పదవి కాలం అయిపోతున్నా కూడా గ్రామాలలో సమస్యలు అదేవిధంగా ఉన్నాయని వీరు పని చేయకుండా పై అధికారుల పేరు చెబుతూ కాలం వెళ్ళబుచుతున్నారన్నారు. తమ పదవి కాలం అయిపోయినా కూడా మేము ప్రశ్నిస్తామని మేము ఎల్లప్పుడూ ప్రజలలో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ అర్జున్ గౌడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ విద్యాలయంలో ఘనంగా వైజ్ఞానిక ప్రదర్శన

- చదువుతోపాటు వైజ్ఞానిక ప్రదర్శనలో విజ్ఞాన్ విద్యార్థుల రాణింపు
- విజ్ఞాన్ విద్యాలయ ప్రధానోపాధ్యాయురాలు పద్మవల్లి
- తిలకించిన విద్యార్థుల తల్లిదండ్రులు
- ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

నవతెలంగాణ-పటాన్‌చెరు

చదువు ఆటపాటలతో పాటు వైజ్ఞానిక ప్రదర్శనలో విజ్ఞాన్ విద్యార్థులు మేటిగా రాణిస్తున్నారని విజ్ఞాన్ విద్యాలయ ప్రధానోపాధ్యాయురాలు పద్మవల్లి పేర్కొన్నారు. పటాన్ చెరు మండల పరిధిలోని చిన్న కంజర్లలో గల విజ్ఞాన్ విద్యాలయంలో శనివారం విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పలువురు వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా



ప్రధానోపాధ్యాయురాలు పద్మవల్లి మాట్లాడుతూ మా విద్యార్థులు చదువు,ఆట పాటలతో పాటు మిగతా రంగాలలో కూడా రాణించేలా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థులను బాల్యం నుండే ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాలలో రాణించేలా దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు



ప్రదర్శించిన వివిధ ప్రదర్శనలు తమని విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. చదువుతో పాటు ఆటలు, వైజ్ఞానిక ప్రదర్శనలో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు. ఉప ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదర్శనను తిలకించి అభినందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలకు ఎల్లప్పుడూ అండగా షీటీం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మహిళలకు ఎల్లప్పుడూ రక్షణగా షీటీమ్ పనిచేస్తుందని హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని నవభారత్ హై స్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, నిర్మూలన గురించి, మానవ అక్రమ రవాణా నిర్మూలన, గుడ్ టచ్, బాడ్ టచ్,సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ అందరు కలిసిమెలిసి ఉండాలని, ఒకరికొకరు చదువులో సహాయం చేసుకుంటూ ఒక లక్ష్యం, గోల్ ఏర్పాటు చేసుకుని కష్టపడి చదువుకోవాలన్నారు. ఎవరు కూడా బాల్య వివాహాలు చేసుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని , బాల్య వివాహాలు, మానవ అక్రమా రవాణా గురించి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు. సెల్ ఫోన్స్ అవసరం మేరకు ఉపయోగించాలని, ఎవరు కూడా సైబర్ నేరాలకు గురికావద్దన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు రెస్పాండ్ కావద్దని, బ్యాంక్ అధికారులమంటూ ఎవరైన ఫోన్ చేసి అకౌంట్ వివరాలూ అడిగితే చెప్పవద్దని సూచించారు. విద్యార్థులను ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీటీమ్ నెంబర్ 87126673443 కాల్ చేయాలని సూచించారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని ఈ వయసులో



ప్రేమ పెళ్లి అంటూ చెప్పే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదువుకోవాలని, మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని చదువు ఉంటే ఎక్కడైనా జీవించవచ్చన్నారు. ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.